

# కూరగాయలు పిరం

- కార్తీకమాసం వెళ్లినా తగ్గని ధరలు
- పెదవి విరుస్తున్న పేద, మధ్యతరగతి ప్రజలు



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : కూరగాయలు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కార్తీక మాసం వెళ్లినా ఏమాత్రం తగ్గనేలేదు. ఆకుకూరలు, కూరగాయలు బాగా పిరమయ్యాయి. సామాన్య ప్రజానీకం కూరగాయలు కొనలేక పచ్చిమిర్చి, టమాట కొనుక్కొని ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి. చికెన్ ధరలు కన్నా కూరగాయలు ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు పెదవి విరుస్తున్నారు. చలికాలం వచ్చిందంటే కూరగాయల దుకాణాలు కిటకిటలాడాల్సింది పోయి మార్కెట్ అంతా వెలవెలబోతున్నది. కూలీ పనులు మీద ఆధారపడి బతుకుతున్న జనం చివరికి పచ్చడి మెతుకులతో గడపాల్సి వస్తున్నది. అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు రేట్లను అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

## వెజ్‌కి నాన్‌వెజ్‌కి తేడానే లేదు

ఒకప్పుడు మాసం తినాలంటే మనస్థాయి కాదులే అనుకునే వాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి తారుమారైంది. చికెన్ కన్నా కూరగాయలు రేట్లు పెరిగిపోయాయి. దీంతో కోడికూరే మేలనుకుంటున్నారు. చికెన్ కిలో 120 రూపాయలు అయితే చిక్కుడుకాయలు కిలో 120 వరకు పలుకుతున్నది. దీంతో చిక్కుడుకాయల జోలికి వెళ్లడం లేదు. కార్తీక మాసంలో చికెన్ ధరలు కొంతమేర తగ్గినా మళ్లీ పెరుగుతున్నాయి. మటన్ ఎప్పటిలాగా కిలో 800 రూపాయలకు విక్రయిస్తున్నారు. అధికారుల నియంత్రణ లేకపోవడంతో కూరగాయల ధరలకు రెక్కలు వస్తున్నాయని జనం ఆరోపిస్తున్నారు.

## గగ్గోలు పెడుతున్న జనం

గత నెలరోజుల నుంచి కూరగాయలు, ఆకుకూరల ధరలు మరింత ప్రియమయ్యాయి. పాలకూర 20 రూపాయలకు నాలుగు కట్టలు అమ్ముతున్నారంటే ఆకుకూరలు ఎంత పిరం అయ్యాయో చెప్పనక్కర్లేదు. ఇటీవల వచ్చిన తుపాన్ ప్రభావం వల్ల కూరగాయల తోటలు నేలకొరగడంతో అదే ఆసరాగా తీసుకున్న వ్యాపారులు ఒక్కసారిగా రేట్లను పెంచేశారు. కిలో ఉల్లి 60 రూపాయలకు అమ్ముతున్నారు. దీంతో జనం గగ్గోలు పెడుతున్నారు. కూలి పనులకు వెళ్లేవారు అన్నం వండుకుని పచ్చడి వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో మంచినూనె, సరుకులకు కూడా రేట్లు బాగా పెరగడంతో ఏం కొనేటట్లు లేదు అని జనం ఆవేదన చెందుతున్నారు.



కొత్తగూడెం రైతుబజార్‌లో కూరగాయల విక్రయాలు చేస్తున్న వ్యాపారులు



### ఇంత రేట్లు ఎప్పుడూ లేవు..



కూరగాయలు తినే పరిస్థితి లేదు. ఇంత రేట్లు ఎప్పుడూ లేవు. టమాట, మిర్చి కొనుకెళ్లి పచ్చడి చేసుకుంటున్నాం. చిక్కుడుకాయలు రూ.120 పెట్టి సామాన్యులు తినలేరు. అరకిలో చికెన్ కొనుక్కోవడం మేలనిపిస్తుంది. షాపుల వద్ద జనం కూడా ఉండడం లేదు. వ్యాపారులను అడిగితే పైనే రేటు ఉందని చెబుతున్నారు.

**– స్వామి, శ్రీనగర్‌కాలనీ, లక్ష్మీదేవిపల్లి మండలం**

### ఏం కొనేటట్లు లేదు..



మార్కెట్‌లో రేట్లు తక్కువ ఉంటాయని పల్లెటూరు నుంచి వచ్చాను. ఇంత రేటు చూసి ఏమీ కొనడం లేదు. ఉల్లిపాయలు, చిక్కుడుకాయలు, ఆకుకూరలు కూడా రేట్లే ఉన్నాయి. పండ్లు అయితే అసలు కొనలేకపోతున్నాము. సీజన్ పోయినా రేట్లు మాత్రం తగ్గలేదు. సార్లు ఎవరూ పేదల గురించి పట్టించుకోరా..

**– పొట్టెమ్మ, పునుకుడుచిలక, లక్ష్మీదేవిపల్లి మండలం**

# వామనావతారంలో రాములోరు..

- దర్శించుకొని పరవశించిపోయిన భక్తులు
- వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి హారతులు
- నేత్రపర్వంగా తిరువీధి సేవ
- మిథిలా స్టేడియంలో అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



పల్లకిలో స్వామివారిని తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు

భద్రాచలం, డిసెంబర్ 17 : ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాద్రి రామయ్య రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఐదో రోజు ఆదివారం రామయ్య వామనావతారంలో దర్శనమివ్వడంతో భక్తులు పరవశించిపోయారు. ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులు, నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపంలో వేంచేపు చేసి అభిషేక తిరుమంజనం జరిపారు. స్వామివారి పన్నిద్రాళ్వార్లను ఆండాల్ అమ్మవారిని, కణ్ణన్ తండ్రిని, కనక సీతను, ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్వామివారిని అంతరాలయంలోనికి తీసుకెళ్లి వామనావతారంలో అలంకరించారు. బేడా మండపానికి తీసుకొచ్చి నాళాయిర ప్రబంధంలోని 200 పాశురాలను ఆస్థాన స్థానాచార్యులు కేశ స్థలశాయి నేతృత్వంలో ఆచార్య బ్రహ్మ ఋత్విక్‌లు అధ్యయనం చేశారు. ఆ తర్వాత అర్చకులు స్వామివారికి వివిధ రకాల హారతులను సమర్పించారు. రాజ భోగం నివేదన చేసి మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారిని ప్రత్యేక పల్లకిలో వేంచేపు చేసి మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ గోదావరి తీరం వద్దకు తీసుకెళ్లి హారతులు సమర్పించి.. తిరిగి మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. వామన రూపంలో ఉన్న స్వామివారిని పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 4 గంటలకు స్వామివారిని తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఎల్.రమాదేవి, ఆలయ ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, వేద పండితులు, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పర్ణశాలలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా రామచంద్రుల వారు వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, శేష కిరణ్ కుమారాచార్యులు, భరద్వాజాచార్యులు, నరసింహాచార్యులు, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి అలంకరణను తిలకిస్తున్న ఆలయ ఈవో

## అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అధ్యయనోత్సవాల్లో భాగంగా మిథిలా స్టేడియంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. ఆదివారం మధ్యాహ్నం తాడేపల్లిగూడెంకు చెందిన ఎం.బాలసుందరం భాగవతార్ చెప్పిన శ్రీకృష్ణ లీలలు హరికథ భక్తులను ఆకట్టుకుంది. రాత్రి 9 గంటలకు ఖమ్మం జిల్లా మధిరకు చెందిన సుమిత్ర యూత్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం అలరించింది. అలాగే పలు సంగీత కార్యక్రమాలు, కూచిపూడి నృత్యాలను కళాకారులు ప్రదర్శించారు.



రామాలయ ప్రాంగణంలో భక్తుల సందడి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

# భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

- భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల
- ఎస్పీ వినీత్‌తో కలిసి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

భద్రాచలం, డిసెంబర్ 17 : ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. భద్రాచలం రామాలయం వద్ద ముక్కోటి ఉత్సవాల ఏర్పాట్లను ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయిస్తున్నామని, ఆఫ్‌లైన్‌లో కూడా టికెట్ల అమ్మకానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కొన్ని టికెట్లు మాత్రమే ఉన్నాయని, ఆసక్తి గల భక్తులు బుక్ చేసుకోవాలని చెప్పారు. 22న గోదావరిలో జరిగే తెప్పోత్సవం, 23న నిర్వహించే ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా సెక్టార్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి సెక్టార్‌లో పర్యవేక్షణ కోసం ప్రత్యేకాధికారులను నియమిస్తామన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా రోడ్లపైకి వచ్చిన దుకాణాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అనంతరం సెక్టార్లను పరిశీలించి దేవస్థానం అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ డాక్టర్ జీ.వినీత్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు గంట ముందుగానే వారికి కేటాయించిన సెక్టార్లకు చేరుకోవాలన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 22, 23వ తేదీల్లో పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఎల్.రమాదేవి, ఆలయ ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఆర్డీవో మంగీలాల్, మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈఈ రవీందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తర ద్వార దర్శనం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్

## రామాలయంలో ధనుర్మాసోత్సవాలు షురూ..

భద్రాచలం, డిసెంబర్ 17 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ తలుపులు తెరిచి 3.30 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకొచ్చారు. 4 గంటలకు ఆరాధన, ఆరగింపు, సేవాకాలం చేపట్టారు. 5 గంటలకు ఉత్సవ పెరుమాళ్లను, ఆండాళ్ అమ్మవారిని, కణ్ణన్ తండ్రిని బేడా మండపంలో వేంచేపు చేసి నివేదన జరిపారు. 6 గంటలకు తిరుప్పావైలోని 30 పాశురాలను వేద పండితులు విన్నవించారు. మంగళాశాసనం, శాత్తుమొర్రై, తీర్థగోష్టి జరిపారు. 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై ఆండాళ్ తల్లిని వేంచేపు చేసి తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ జరిపారు. సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు ప్రాకార మండపంలో తిరుప్పావై ప్రవచనం జరిపారు. పట్టణంలోని అహోబిల మఠంలో పొడిచేటి సీతారామానుజాచార్యులు తిరుప్పావై ప్రవచనం చేశారు. జీయర్ మఠంలో దేవస్థానం వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు ఉదయం 8.30 గంటలకు తిరుప్పావై, సేవాకాలం, గోష్టి తదితర కార్యక్రమాలు చేపట్టారు. సీతారామనగర్ కాలనీలో వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ధనుర్మాసోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు.



డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన సరస్వతి విగ్రహం



కొడుకు దహన సంస్కారాలు చేయడానికి తల్లికి ఆర్థికసాయం

# అభాగ్యులకు అమ్మ

- 14 ఏండ్లుగా సేవలందిస్తున్న ట్రస్ట్
- వందలాది మందికి ఆర్థికసాయం
- స్ఫూర్తి రగిలిస్తున్న చిరు వ్యాపారులు

ఇల్లెందు, డిసెంబర్ 17 : అనాథలు, అభాగ్యులకు సాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు ఇల్లెందు పట్టణానికి చెందిన చిరు వ్యాపారులు. 2008 సంవత్సరంలో పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపాన ఓ చెట్టుకింద ఇదే నెలలో చలికి వణుకుతున్న అభాగ్యురాలిని చూసి వారు చలించిపోయారు. మనకు ఉన్నదాంట్లో కొంతైనా కూడబెట్టి పరులకు సాయపడాలని ఆ రోజే నిశ్చయించుకున్నారు. 12 మంది స్నేహితులు కలిసి 'అమ్మ' పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్‌ను 2009లో ఏర్పాటు చేశారు. ప్రతి సభ్యుడు రోజు రూ.300 జమచేస్తూ రూ.4 లక్షల నిధిని సమకూర్చారు. దానినుంచి వచ్చే వడ్డీ డబ్బుల ద్వారా పదిమందికి సాయపడాలని నిర్ణయించుకున్నారు. పబ్లిసిటీకి దూరంగా ఉంటూ గత 14 ఏండ్లుగా ఎంతోమందిని ఆదుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



హరితహారంలో మొక్కలు నాటుతున్న యువకులు

## వందలాది మందికి ఆర్థిక సాయం

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తాళిబొట్లు, పెళ్లి అవసరాలకు ఆర్థిక సాయం అందించారు. ఓ ఆటో డ్రైవర్ కూతురు కిడ్నీ వ్యాధితో బాధపడుతుంటే ఆదుకున్నారు. ఏజెన్సీలో ప్రజలు సీజనల్ వ్యాధులతో సతమతమవుతుంటే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. అనాథ ఆశ్రమంలో పిల్లలకు కావాల్సిన వస్తువులు అందించారు. దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేని పేదింటి ప్రజలకు డబ్బులిచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. అంగన్‌వాడీ పాఠశాలలో ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. రోడ్లపై యాచకులను గుర్తించి దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నోట్ పుస్తకాలు, ప్యాడ్‌లు, పెన్నులిచ్చారు. మంచి మార్కులొస్తే బహుమతులందించి ప్రోత్సహించారు. కరోనా సమయంలో అనేక మందికి నిత్యావసర సరుకులు, కరోనా కిట్లు, కూరగాయలు అందించి భరోసా కల్పించారు. గోదావరి పుష్కరాల సమయంలో అన్నదానం, పట్టణంలో పౌరులకు బల్లాలు ఏర్పాటు చేశారు. హరితహారంలో మొక్కల పంపిణీ, నాటడం.. ఇలా అనేక విషయాల్లో వందల మందికి రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకూ సాయం అందించి ఇతరుల్లో స్ఫూర్తిని రగిలిస్తున్నారు.

## స్ఫూర్తి రగిలిస్తున్న యువకులు

తమకున్న దాంట్లో నుంచి కొంతైనా ఇతరులకు సాయం చేయాలనుకుంటున్న ఆ యువకులు సమాజంలో స్ఫూర్తి రగిలిస్తున్నారు. రోజువారీ అనవసర ఖర్చులు చేస్తున్న అనేకమందికి భిన్నంగా వారు ప్రతిరోజు కొంత డబ్బు జమ చేస్తున్నారు. వారిని ఎవరు సంప్రదించినా ఇప్పటి వరకు కాదనలేదు. బాధపడుతున్న వారి వివరాలు తెలిసినా అక్కడకు చేరుకొని చిరు సహాయాలు చేస్తున్నారు. ఇలా పలువురిని ఆదుకుంటున్న ట్రస్ట్ సభ్యులు మానవత్వాన్ని బతికిస్తున్నారు.

### మాకు చేతనైన సాయం చేస్తున్నాం..



మేము సాయం అందించిన వాటిలో ఎక్కువ భాగం విద్య, వైద్యానికి సంబంధించినవే. విద్య, వైద్యరంగాన్ని మెరుగైన రీతిలో పూర్తిగా ఉచితంగా అందిస్తే పేదలకు ఇక్కట్లు తప్పుతాయి. మాకు చేతనైనంత సాయం అభాగ్యులకు చేస్తూనే ఉంటాం.

**– పల్లెర్ల చంద్రశేఖర్, ట్రస్ట్ అధ్యక్షుడు**

### యాచకురాలిని చూసి చలించిపోయాం..



2008లో ఓ ముసలమ్మను చూసి నలుగురం స్నేహితులం చలించిపోయాం. మరో 8 మందిని కలిసి విషయం చెప్పాం. వారు కూడా ఒప్పుకోవడంతో 12 మందితో ట్రస్ట్ ఏర్పాటు చేశాం. దిక్కులేని వృద్ధులకు ముందుగా సహాయం అందించాలని నిర్ణయం తీసుకున్నాం. పట్టణంలో అన్నిచోట్ల తిరిగి కంటికి కనిపించిన వారికి సహాయం చేయడం ప్రారంభించాం.

**– తేలుకుంట్ల రజనీకాంత్, కార్యదర్శి, అమ్మ ట్రస్ట్**

### సాయం చేయడానికి ముందుకు రావాలి..



సహాయం చేయడానికి ఏ వేదిక అక్కర్లేదు. ఎవరికి తోచిన సాయం వారికి తగ్గట్టు చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలి. ఇబ్బందుల్లో, బాధల్లో ఉన్నవారిని ఆదుకొని మానవత్వం చాటుకుంటే చాలు. ఒకరిని చూసి మరొకరు ఇలా అందరు ఆ దిశగా నడవాలి. అలా చేస్తే జీవితంలో కొంతైనా తృప్తి మిగులుతుంది.

**– యెలుగూరి నగేశ్, సభ్యుడు, అమ్మ ట్రస్ట్**